ప్రజాశక్తి

శుక్రవారం 17 మార్చి 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

'వెలిగొండ' నిర్వాసితులకు

పరిహారం అందేలా చర్యలు

- పత్రాల పరిశీలన వేగవంతం చేయాలి
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణంతో నిర్వాసితులవుతున్న ప్రతి కుటుంబానికీ పరిహారం అందేలా సంబంధిత పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఈ విషయంపై సంబంధిత అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను గుర్తించడానికి 2002 నుంచి 2005 వరకు అందుబాటులో ఉన్న అన్ని డాక్యుమెంట్లను మరోసారి పరిశీలించాలన్నారు. తాము కూడా నిర్వాసితులమే నంటూ 1127 కుటుంబాలు సమర్పించిన పత్రాలను కేటగిరీల వారీగా పరిశీలించాలని ఆదేశించారు. పునరావాస, పునర్నిర్మాణ ప్యాకేజీని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ ప్యాకేజీ పొందడానికి అర్హులైన వారు చనిపోతే వారి నామినీల పేరుతో పరిహార ప్యాకేజీలను తయారు చేయాలని, అర్హుల జాబితాలో ▶ 2లో

'వెలిగొండ'కు సరిపడా నిధులేవీ?

- బడ్జెట్‌లో కేవలం రూ.101.47 కోట్లు కేటాయింపు
- ప్యాకేజీలకు కేటాయిస్తారనే ఆశతో నిర్వాసితులు
- కొరిశపాడు లిఫ్టుకు రూ.165 కోట్లు.. గుండ్లకమ్మకు రూ.30 కోట్లు
- రాళ్లపాడు, మోపాడు ప్రాజెక్టులకు నామమాత్రపు కేటాయింపులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలో కీలకమైన ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు మొండిచేయి చూపారు. ఎన్నికల కోసం పెట్టిన బడ్జెట్‌గా ఉందే తప్ప జిల్లాలో ఉన్న పెండింగు ప్రాజెక్టుల పూర్తికి దోహదపడేలా లేదనే విమర్శలూ తీవ్రమయ్యాయి. గతేడాది కంటే అన్నిటికీ తగ్గించారు. ఈ ఏడాది సెప్టెంబరులో ప్రారంభిస్తామని స్వయంగా సిఎం జగన్ చెప్పిన వెలిగొండకు కేవలం రూ.101.47 కోట్లు మాత్రమే కేటాయించారు. గతేడాది బడ్జెట్‌లో రూ.856 కోట్లు కేటాయించారు. దీనికి కనీసం రూ.1500 కోట్లు అవసరమని అంచనా.

ఈ ఏడాది కేటాయింపులు అందరినీ నిరాశపరిచాయి. ప్యాకేజీలు కోసం రూ.1200 కోట్లకుపైగానే నిధులు కావాల్సి ఉంది. గ్రామాలు ఖాళీచేసి వెళ్లాలంటే ఇప్పుడు ప్యాకేజీలు ఇవ్వాల్సి ఉంది. జాబితాలను కొత పెడుతున్నారంటేనే బాధితులకు బోధపడింది. ఏదో రకంగా నిధులు తగ్గించేందుకేనన్న చర్చ కూడా ఉంది. ఇది ఇప్పుడు నిజమైంది. వెలిగొండ నిర్వాసితులకు ప్యాకేజీలు ఇస్తారా? లేదా? అన్నదీ చూడాలి. ఇప్పుడు కేటాయించిన నిధులు ఎందుకూ చాలవు. మంత్రి ఆదిమూలపు సురేష్ ఇప్పుడు నిర్వాసితులకు ఏ సమాధానం చెబుతారన్నదే చూడాలి. వెలిగొండను మేమే ప్రారంభిస్తామని చెబుతోన్న పాలకపక్షం పెద్దలు ఇప్పుడు నిర్వాసితులను నీళ్లలోనే ఉంచి ప్రారంభిస్తారా? అనేదీ చూడాలి. అన్ని రాజకీయపార్టీలు కూడా వెలిగొండకు నిధుల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గతేడాది కేటాయించినట్లే ఈ ఏడాది కూడా రూ.30 కోట్లు కేటాయించారు. వాస్తవానికి దీని గేట్లు దెబ్బతిని ఈ ఏడాది నీరు వృథాగా పోయింది. అన్ని గేట్లు దెబ్బతినిపోయాయి. నిర్వహణకు నిధులు అదనంగా కేటాయించాల్సి ఉంది. కేవలం రూ.30 కోట్లు చూపారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకానికి భారీగానే రూ.165.67 కోట్లు కేటాయించారు. జిల్లాలో దీనికే ఇప్పుడు ఎక్కువ నిధులు చూపారు. రాళ్లపాడుకు రూ.1.12 కోట్లు, మోపాడుకు రూ.1.28 కోట్లు కేటాయించారు. వరద నివారణ ప్రాజెక్టుల్లో ఉన్న ఒంగోలు పోతురాజుకాలువకు రూ.1.95 కోట్లు కేటాయించారు. ఇవి తప్ప ఇరిగేషన్‌కు పెద్దగా కేటాయింపులు లేవు. జిల్లాలో ఇతర ఉపాధి ప్రాజెక్టులు, పరిశ్రమలకు సంబంధించిన కేటాయింపులు ఏమీ కనిపించలేదు.

ఎంపీ మాగుంటకు ఈడీ నోటీసులు

18న విచారణకు హాజరుకావాలని ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలో లిక్కర్ కుంభకోణంలో ఇప్పటికే ఆయన కుమారుడిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. బెయిల్ కోసం ప్రయత్నాల్లో ఉన్నారు. తాజాగా ఈడీ ఎంపీ మాగుంటకూ నోటీసులు ఇచ్చింది. దీంతో వైసిపి వర్గాల్లో చర్చకు దారితీసింది. ఢిల్లీ కేంద్రంగా జరిగిన లిక్కర్ స్కాంలో ఎంపీ మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డి పాత్రపై ఈడీ ఛార్జిషీటులో పలు అంశాలను చేర్చింది. ముందు ఆయన కుమారుడిని అరెస్టు చేసిన ఈడీ అధికారులు ఇప్పుడు మాగుంటపైనా దృష్టి సారించారు. ఆయనకు నోటీసు ఇచ్చారు. ఈ నెల18న విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ఇటీవలే మాగుంటతో పాటు మాజీ మంత్రి బాలినేని కూడా లిక్కర్ స్కాంపై మీడియాతో మాట్లాడారు. మాగుంట కుటుంబాన్ని ఉద్దేశపూర్వకంగానే ఈ కేసులో ఇరికించారని బాలినేని ఆరోపించారు. ఆయనకు పార్టీ అండగా ఉంటుందని వెల్లడించారు. అయితే తాజాగా మాగుంటకూ నోటీసులు జారీ చేయడంతో పాలకపక్షంలో ఉత్కంఠ చర్చకు దారితీస్తోంది. విచారణ అనంతరం జరిగే పరిణామాలు ఎలా ఉంటాయోనన్న చర్చ పార్టీ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.

యర్రగొండపాలెంలో వర్షం, గాలుల వల్ల నేలకొరిగిన చెట్టు

వడగండ్ల వాన

- ఈదురుగాలులతో భారీ వర్షం..
- నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు
- పిడుగుపాటుకు ఒకరు మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం, త్రిపురాంతకం

జిల్లాలో పలుచోట్ల గురువారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. త్రిపురాంతకంలో వడగండ్ల వాన కురవగా.. యర్రగొండపాలెంలో భారీగాలులతో కూడిన వర్షం పడింది. యర్రగొండపాలెం మండలంలోని గొల్లవిడిపి గ్రామ సమీపంలో పిడుగుపడటంతో ఒకరు మృతిచెందారు. ఇద్దరికి గాయాలయ్యాయి.

యర్రగొండపాలెం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో గురువారం భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. సుమారు రెండు గంటలు పాటు కురిసిన ఈ వర్షంతో వాతావరణం చల్లబడి మబ్బులు కమ్ముకున్నాయి. పలు గ్రామాల్లోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ ప్రసారం నిలిచిపోయింది. గ్రామాల్లో సైతం విద్యుత్ కండక్టర్ వైర్లు తెగి విద్యుత్ ప్రసారం ఆగింది. ఇదే వర్షం ఐదారు గంటలు కురిస్తే వాణిజ్య పంటలకు కొంత ఉపయోగకరంగా ఉండేదని రైతులు ఆశ పడుతున్నారు.

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం మండలంలో కుండపోత వర్షంతో పాటు వడగండ్ల వాన కురిసింది. అక్కడక్కడా చెట్లు పడిపోయాయి. కరెంటు తీగలు తెగిపడ్డాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ ప్రసారం నిలిచిపోయింది.

పిడుగు పాటుకు ఒకరు మృతి

మృతిచెందిన నరసింహులు

యర్రగొండపాలెం మండలంలోని గొల్లవిడిపి గ్రామానికి చెందిన పాలు వెంకటేశ్వర్లు, దేవరకొండ నగేష్, పాలు నరసింహులు (45) గురువారం ▶ 2లో

నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అమరజీవిని ఆదర్శంగా తీసుకోవాలి

నివాళులర్పించిన కలెక్టర్ దినేష్ కుమార్

▶ 8లో

విద్యాహక్కు చట్టం కింద

ఉచిత విద్య అందించాలి

కలెక్టర్ విజయకృష్ణన్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. గురువారం బాపట్ల కలెక్టరేట్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడానికి తీసుకోవలసిన చర్యలపై పాఠశాల యాజమాన్యంతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం కింద 25 శాతం ఆర్థికంగా వెనుకబడిన ఎస్.సి, ఎస్.టి, బి.సి, మరియు మైనార్టీ పిల్లలకు పాఠశాలల్లో అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు గురువారం సాయంత్రం లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని తెలియజేసే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో హెల్ప్ డెస్క్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలకు చిన్నవయస్సు నుండే క్రమశిక్షణ నేర్పాలన్నారు. ఫోక్సో చట్టం గురించి పాఠశాలల్లో పిల్లలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు పాల్గొన్నారు.

'వెలిగొండ' నిర్వాసితులకు పరిహారం అందేలా చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

చేర్చాలంటూ వచ్చిన 137 ఫిర్యాదులను కూడా మరోసారి పరిశీలించాలన్నారు. సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ గొట్టిపడియ, గుండంచర్ల వాసులకు పరిహార ప్యాకేజీలకు ఆమోదం లభించాక ఇళ్ల పట్టాలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళా వందనం, కంభం యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మార్కాపురం, కంభం యూనిట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వడగండ్ల వాన

(మొదటిపేజీ తరువాయి)

పొలం పనులు చేస్తున్నారు. ఒక్కసారిగా గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఆ ముగ్గురు పొలంలో దగ్గర్లో ఉన్న చెట్టు కిందకు వెళ్లారు. ప్రమాదవశాత్తు అక్కడ పిడుగు పడటంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరూ గాయాలపాలయ్యారు. వీరిని యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నరసింహులుకు భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ బాబూరావు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - చీరాల

సేవా కార్యక్రమాలలో రోటరీ క్లబ్ అన్నివేళలా ముందుంటుందని, ఇబ్బందులలో ఉన్న వారి అవసరాలను గుర్తించి చేయూతను అందిస్తోందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు తెలిపారు. వైకుంఠపురానికి చెందిన మద్దిబోయిన సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన వైద్యఖర్చుల నిమిత్తం రూ. 7 వేల నగదును రోటరీ క్లబ్ ప్రతినిధులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం గత కొలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని ఆ కుటుంబ అవసరతను గుర్తించి రోటరీ క్లబ్ చేయూతనందించినట్లు తెలిపారు. పేదలకు ఆర్థిక సాయం అందించేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధి పోలుదాసు రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జీడిమామిడి'లో చీడపీడలను గుర్తించేందుకు

తెలుగులో మొబైల్ యాప్

ప్రజాశక్తి-బాపట్ల, బాపట్ల జిల్లా

జీడిమామిడి పంటలో తెగుళ్ల, వ్యాధులు మరియు పోషకాల లోపాలను గుర్తించడానికి కత్రిమ మేధస్సు ఆధారిత (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) వెబ్‌సైట్ మరియు మొబైల్ యాప్‌ను రూపొందించారు. తెలుగు రాష్ట్ర రైతులకు మరింత మెరుగైన అవగాహన కోసం ఈ యాప్‌ను తెలుగు భాషలో కూడా అందుబాటులో ఉంచినట్లు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కె. ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.నాగేంద్ర రెడ్డి తెలిపారు. తెలుగు భాషను చేర్చిన తర్వాత ఈ యాప్‌ని ఉపయోగించడం వల్ల ఆంధ్రప్రదేశ్ రైతులు ప్రయోజనం పొందవచ్చున్నారు. జీడిమామిడి రైతులకు పోషకాహార లోపాలతో పాటు తెగుళ్ల మరియు వ్యాధుల సరైన నిర్వహణ కోసం తరచుగా నిపుణుల సలహా అవసరమని పేర్కొన్నారు. గ్రామాలు మరియు పొలాల మారుమూల స్వభావం కారణంగా, సలహా చాలా అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులో ఉండదని, మొబైల్

టెక్నాలజీలలో సాంకేతికత ద్వారా ఇటువంటి యాప్‌లు చాలా వరకు సహాయపడతాయని పేర్కొన్నారు. మొదటగా ఈ వెబ్‌సైట్/యాప్ ద్వారా అప్‌లోడ్ చేసిన చిత్రాల నుండి దాదాపు 60 జీడిమామిడిని ఆశించే తెగుళ్ల, 20 వ్యాధులు మరియు 10 పోషక లోపాలను తక్షణమే నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రస్తుతానికి మొదటి దశలో దీనిని ఆరు తెగుళ్ల మరియు ఒక వ్యాధిని గుర్తించడానికి తయారు చేసారని చెప్పారు. రానున్న కాలంలో దీనిని ఇంకా అభివద్ధి చేస్తారని శాస్త్రవేత్తలు తెలిపారు. గుర్తించబడని లేదా అసంతప్తికరమైన ఫలితాలు వస్తే నిపుణులను సంప్రదించడానికి మరియు సోషల్ మీడియాలో ఫొటోలను భాగస్వామ్యం చేయడానికి కూడా అవకాశం ఇవ్వబడినట్లు తెలిపారు. ఈ యాప్ చీడపీడలను ముందస్తుగా గుర్తించడానికి మరియు నిర్దిష్ట ప్రాంతంలోని రైతులను అప్రమత్తం చేయడానికి సహాయ పడుతుందన్నారు. ఇంకా దేశంలోని వివిధ సంస్థల ద్వారా నివారణ చర్యల కోసం అవసరమైన సాంకేతిక సలహాలు మరియు సూచనలు అందించడానికి ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ యాప్‌ను భారత వ్యవసాయ పరిశోధన మండలి - జీడిమామిడి పరిశోధన సంచాలయం, పుత్తూరు, కర్ణాటకతో పాటుగా దేశవ్యాప్తంగా ఉన్న అఖిల భారత సమన్వయ జీడిమామిడి పరిశోధనా పథకము శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యారని చెప్పారు. ఈ యాప్‌ను జీడిమామిడి సాగు చేస్తున్న రైతులు వినియోగించు కోవాలని కోరారు.

కంటి ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ

ప్రజాశక్తి బాపట్ల

మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆహారపు అలవాట్లతో ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ తెలిపారు. ప్రపంచ నీటి కాసుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల ఏరియా వైద్యశాలలో నీటి కాసుల వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటిలో నీటి కాసులతో కంటి చూపు క్రమేపి తగ్గిపోయే దశ ఎదురైతే తక్షణమే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు. నీటి కాసుల నిర్ధారణ పరీక్షలు బాపట్ల ,చీరాల ఏరియా వైద్యశాల్లో ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ కంటి సంబంధించిన సమస్యలు వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సప్రందించాలన్నారు. వ్యాధి గ్రస్తులు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వినియోగించుకునే విధంగా ప్రచార కార్యక్రమం నిర్వహించాలని వైద్యాధికారులను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ ఎవి. శేషు రమణ, బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ కె. సిద్ధార్థ, ఆర్ఎంఒ కోటేశ్వరరావు, కంటి వైద్య నిపుణులు పి. ఉషా కిరణ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ

Notice under order Sections 53 and 54 of Provincial Insolvency Act

కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No. 69/2020
I.P.No.9/2005

అఫిషియల్ రిసీవర్,
ఒంగోలు, ప్రకాశం జిల్లా. ... పిటిషనర్

Vs

బాపనపల్లి వెంకట సుబ్బారావు
మరియు 5 గురు ... రెస్పాండెంట్లు

To,
ఇండ్ల శివకుమారి, భర్త **చెంచురామయ్య,**
వేటపాలెం గ్రామం మరియు మండలం,
ప్రకాశం జిల్లా.

అమ్మా,
మీరు మరియు 2వ రెస్పాండెంట్ **చలంచర్ల చెంచయ్య** గారలు కలిసి, 4,5 మరియు 6 రెస్పాండెంట్లు **అయిన బోగినేని చెంచు రామానాయుడు, బోగినేని కళ్యాణి, బోగినేని అనుపానంద** గార్లకు **27-10-2004 వ తేదీన,** వ్రాసి ఇచ్చిన విక్రయ పత్రమును రద్దు పరచమని కోరి, పిటిషనర్ పై కోర్టులో మీ వగైరాలపైన పై పిటిషన్ దాఖలు చేసినందుకు గాను మీకు నోటీసు నిమిత్తం **06-04-2023 వ తేదీన** వాయిదా వేయబడి ఉన్నది. కాన సదరు వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు ద్వారా గాని పై కోర్టుకు హాజరై పై విషయమై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానించెదరు.

కె. రాజశేఖర్ రెడ్డి
అడ్వకేట్, కదుకూరు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

డిఎస్‌పి శ్రీకాంత్

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే మంచి భవిషత్తు ఉంటుందని డిఎస్‌పి శ్రీకాంత్ తెలిపారు. స్థానిక చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను అరికట్టడమే లక్ష్యంగా సంకల్పం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో వేళ్లూనుకుపోతున్న మాదకద్రవ్యాలను అరికట్టదానికి విద్యాసంస్థల యజమానులు డ్రగ్స్ నిర్మూలన కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి బాపట్ల జిల్లాను గంజాయి మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చి దిద్దటానికి కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, రూరల్ సిఐ మల్లికార్జున రావు, లక్ష్మయ్య, ఈపూరుపాలెం ఎస్ఐ జనార్ధన్, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి

గ్రామ పంచాయతీ కార్యాలయం,ఐలవరం

భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా

టెండర్ నోటీస్

తేది : 16-03-23

బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, ఐలవరం గ్రామపంచాయతీకి ఈ దిగువ తెలిపిన సీల్డ్ టెండర్లు, సామాను లు సరఫరా చేయుటకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ పాల్గొనువారు టెండర్ ధరవత్ చెల్లించిన రసీదు ను జతపర్చి దాఖలు చేయవలెను డి.18-03-23 సాయంత్రం గం.3.00 స్వీకరించి 3.30 గం. హాజరైన టెండర్ దార్ల సమక్షంలో తెరవబడును. ఏ కారణం తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు కార్యదర్శి వారికి అధికారం కలదు.

షెడ్యూల్డ్

వ.నెం.	వివరములు	టెండరు ధరావత్తు
1.	2023-24 కు గాను టెండరు పద్ధతిపై స్వీపర్ పోస్టులు-6	100
2.	2023-24 కు గాను టెండరు పద్ధతిపై ఎలాక్ట్రిషియన్ -1	100
3.	2023-24 కు గాను టెండరు పద్ధతిపై మోటారు ఆఫరేటర్-1	100
4.	పి హెచ్ సామాన్లు, పి డబ్ల్యు ఎస్ సామాన్లు సరఫరా చేయుట.	100 రు
5.	2023-24 కు గాను పంపు సామాన్లు, స్టేషనరీ సామాన్లు సరఫరా చేయుట	100.

స్థలం.ఐలవరం.
తేదీ. 16.03.23

సం/-
గ్రామ పంచాయతీ కార్యదర్శి
ఐలవరం.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ కె విజయ కష్ణన్, జేసీ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నివాళి అర్పించారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె విజయ కష్ణన్, జేసీ శ్రీనివాసులు, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని, అప్పటిలో మద్రాస్ రాష్ట్రంలో వున్న తెలుగు మాట్లాడే పదకొండు జిల్లాలను ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో పొట్టి శ్రీరాములు మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించి పట్టు వీడకుండా తన నిరాహార దీక్షను కొనసాగించి రాష్ట్ర సాధన కోసం అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన త్యాగం ఎప్పటికీ తెలుగు ప్రజలు మరవరాదని అన్నారు. యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్, జేసీ శ్రీనివాసులు

పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

అద్దంకి: అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా గురువారం ఆర్యవైశ్య ప్రముఖులు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్య సంఘం బాధ్యులు పోకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ కోట శ్రీనివాస్‌కుమార్, భాస్కర్ సప్లయ్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు, విగ్రహానికి సహకరించిన దాతలు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో..

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి రోటరీ బాధ్యులు సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ బాధ్యులు సభ్యులు ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని గురువారం వేటపాలెం యూనియన్ బ్యాంక్ సెంటర్‌లోని అమరజీవి విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీరాల సబ్ డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి శ్రీకాంత్, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, వేటపాలెం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి సురేష్ అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమరజీవి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా, ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో జరపాలని నిర్ణయించడం సంతోషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ మాట్లాడుతూ అమరజీవి త్యాగాలను కొనియాడారు. అనంతరం డిఎస్పి శ్రీకాంంత్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం సహాయ కార్యదర్శి నున్నా శివప్రసాద్ రావు, గుడుమూటి శేఖర్‌బాబు, రావి మస్తాన్‌రెడ్డి, సభ్యులు మరియు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోటి స్వామి గుప్త, వంకా శ్రీనివాసరావు, కరణం మురళీ కృష్ణ, జీడిపప్పుల సంఘం కార్యదర్శి బదరీనాథ్, వాకా రామచంద్రారెడ్డి, విశ్రాంత రైలు ఉద్యోగి ఖాన్, గొడవర్తి రామకృష్ణ, పూల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఎన్టీఆర్ ఫుడ్ సైన్స్ కళాశాలలో పొట్టి శ్రీరాములుకు నివాళి

సంతమాగులూరు: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి స్వర్గీయ పొట్టి శ్రీరాములు ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం సంతమాగులూరు గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేపల్లె: ఆంధ్ర రాష్ట్ర సాధనకు 58 రోజులు ఆమరణ నిరహార దీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలను పట్టణ టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి టిడిపి బాపట్ల జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ఆలపాటి వేణు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆలపాటి వేణు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పట్టుదలతో 58 రోజుల పాటు అమరణ నిరాహార దీక్ష చేశారని, తెలుగు ప్రజల అభివృద్ధి కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయం, త్యాగం వృథా కావని అన్నారు. శ్రీరాములు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ఆలపాటి వేణు, రేపల్లె పట్టణ మహిళా అధ్యక్షురాలు పొన్నూరు గౌరీ రామకుమారి, రూరల్, పట్టణ పార్టీ అధ్యక్షులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, గోగినేని రామారావు, నేతలు జివి నాగేశ్వరరావు, అన్నం వెంకటేశ్వరరావు, తడికమళ్ళ బాలు, షేక్ బాషా, పంతాని సాయికుమార్, వెనిగళ్ల సుబ్రహ్మణ్యం, తాడిపర్తి మల్లిఖార్జునరావు, తంగెళ్లమూడి సాయిబాబు, పర్చూరి విజయ్ కుమార్, ఆలూరి సురేష్, బద్దెల సాయి, బొర్రా సూర్య రాజ్, నల్లూరి అజయ్, రాచాబత్తుని శ్రీనివాసరావు, దాసరి అమరనాథ్, నీలా కోటేశ్వరరావు, కొండవీటి అగస్త్య, రావి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల: తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన తొలి వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ ఇన్‌ఛార్జి డీన్ ఎస్ రత్నకుమారి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా వ్యవసాయ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆ మహనీయుని స్మరించుకోవడం మాత్రమే గాక ఆయన పోరాట పటిమను ప్రతి విద్యార్థి అలవరచుకోవాలని రత్నకుమారి అన్నారు. మద్రాసులోని బులుసు సాంబమూర్తి ఇంట్లో 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి చివరకు అసువులు బాసిన పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి చేసిన త్యాగం తరతరాలు గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నిర్మించాలి

బాపట్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా వైద్యశాలలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్తమాసు సత్యనారాయణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొత్తమాసు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాడి ఆంధ్ర జాతి ఐక్యత, ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన పొట్టి శ్రీరాములు ఆదర్శ ప్రాయుడన్నారు. 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి 58 అడుగుల విగ్రహాన్ని రాజధానిలో ఏర్పాటు చేసి, భారతరత్న అవార్డుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కొత్తమాసు కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు బూర్ల అనిల్, ప్రధాన కార్యదర్శి కోళ్లపూడి సురేష్, కోశాధికారి కోళ్లపూడి ఉపేంద్రగుప్త, మామిడి రమేష్ కుమార్, కృష్ణకిషోర్, సాంబశివరావు, అప్పారావు, బుల్లిబాబు, వేణు, ధూళిపాళ్ల లక్ష్మీనారాయణ, భాస్కర్ ప్రసాద్, పుల్లయ్య గుప్త, వనమా నారాయణ, నరాలశెట్టి ప్రకాష్, తాళ్లూరి శ్రీనివాస రావు, టీ మల్లికార్జునరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్, సిద్ధార్థ, డాక్టర్ శేషు కుమార్ పాల్గొన్నారు.

బాపట్ల రూరల్: బాపట్ల ఎన్టీఆర్ ఫుడ్ సైన్స్ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సిహెచ్‌వివి సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ఆయన తన ప్రాణాలనే త్యాగం చేశారన్నారు. నేటి యువత ఆయన స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విమలా బీర, ఆయా శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయాలపాలైన కూలీలు

ఆటోను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-త్రిపురాంతకం

పొట్టకూటి కోసం మిర్చి కోతలకు వెళుతున్న కూలీలు ప్రయాణించే ఫోర్ వీలర్ ఆటోను లారీ ఢీకొని గాయాలపాలైన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. త్రిపురాంతకం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కొందరు కూలీలు దూపాడు గ్రామానికి మిరపకాయలు కోయడానికి వెళుతుండగా వెల్లంపల్లి గ్రామ సమీపంలో వినుకొండ నుంచి వస్తున్న లారీ ఆటోను ఓవర్ టేక్ చేయబోయి ఆటోను ఢీకొన్నది. ఈ సంఘటనలో రాజుపాలెం గ్రామానికి చెందిన ఏ. లక్ష్మీనరసింహ అనే వ్యక్తికి కాలు విరగడం జరుగగా చిలకల శంకర్ రెడ్డి, దానే ఆదెమ్మ అనువారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయాలపాలైన వారికి ప్రథమ చికిత్స అందించి అనంతరం వారిని త్రిపురాంతకంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మాట్లాడుతున్న ఎఎస్‌పి నాగేశ్వరరావు

మద్యం అక్రమ రవాణాపై చర్యలు

ఎఎస్‌పి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

అక్రమ మద్యం రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎఎస్‌పి కె నాగేశ్వరరావు తెలిపారు. హర్యానా నుంచి తీసుకొస్తున్న 636 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎస్ఇబి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద బూరేపల్లి కాలనీలో ఇతర రాష్ట్రాల మద్యం ఉందన్న సమాచారంతో ముద్దాయిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. అందులో ఎ1 నాగులుప్పలపాడు మండలం కొత్తకోటకు చెందిన తన్నీరు శబరిగిరి, ఎ2 మోరతోటి నాగార్జున, ఎ3 కుంచాల ప్రవీణ్‌లను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఇబి ఇఎస్ ఆవులయ్య, సూపరింటెండెంట్ ఎం సుధీర్‌బాబు, సిఐ వంశీధర్, ఎస్ఐ నగర్, మాధవి పాల్గొన్నారు.

వ్యక్తికి పాముకాటు

ప్రజాశక్తి-అద్దంకి: చెరుకు తోటలో పనిచేస్తుండగా పాము కాటుకు గురైన ఘటన మండలంలోని సాధునగర్ గ్రామంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పసుపులేటి సుధాకర్ తనకు చెందిన చెరుకు పంటలో పనిచేస్తున్న సమయంలో రక్తపింజరు పాము కాటు వేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు ఇది గమనించి 108కి సమాచారం అందించడంతో వారు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధిత వ్యక్తిని ఒంగోలు లోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ఇద్దరు బిడ్డలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత యువతి తన ఇద్దరు బిడ్డలతో సహా పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మార్టూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రామ్ జనార్ధన్ కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. 108 సిబ్బంది బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జనార్ధన్ కాలనీకి చెందిన కుంభా గోపి, లక్ష్మి దంపతులు. వీరికి ఏడు సంవత్సరాల వయసు గల దీక్షిత, మూడు సంవత్సరాల వయసు గల ఆశిష్ సంతానం. గత మూడు నెలల క్రితం భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఒకే ఇంట్లో ఉంటున్నప్పటికీ ఇద్దరూ మాట్లాడుకోవడం లేదు. జరుగుతున్న పరిణామాలతో మనస్థాపానికి గురైన లక్ష్మి పురుగుమందు పెట్రోల్‌లో కలుపుకొని తాను తాగి తన ఇద్దరు చిన్నారులకు తాగించింది. గమనించిన సమీప బంధువులు 108 వాహనం ద్వారా ముగ్గురిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లీ కూతుళ్లు

మాటలు రాకపోయినా చదువులో ముందంజ

ప్రజాశక్తి-అద్దంకి

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థి ఇంటర్మీడియట్ నరేష్

పట్టణంలో నాలుగు కేంద్రాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసేందుకు వాసవి జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న మాటలు రాని విద్యార్థి నరేష్ రాజు చదువుపై ఉన్న మక్కువతో ఎంతో ఇష్టంగా పరీక్ష రాసేందుకు తల్లితో కలిసి ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకొన్నారు. ఆ విద్యార్థికి పలువురు అభినందనలు తెలిపారు. తొలిరోజు జరుగు తెలుగుతున్న పరీక్షా కేంద్రాన్ని తహశీల్దార్ జివి సుబ్బారెడ్డి సందర్శించి రూమ్‌లో విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఎంపిడిఒ పరిశీలన

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని యనమదల గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం యద్దనపూడి ఎంపిడిఒ కృష్ణకుమారి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, సచివాలయ సిబ్బంది చిరంజీవి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

విద్యార్థులలో పునాది భాష, గణిత భావనలు, అందుబాటులో ఉన్న వనరుల ద్వారా మౌలిక భాషోన్నతి పెంపొందించేందుకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించారు. చెరుకుపల్లి మండల పరిధిలోని గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాపట్ల డివిజన్ పరిధిలోని మండలాల ఉపాధ్యాయులకు డైట్ లెక్చరర్లచే శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో విద్యార్థులకు 2025 సంవత్సరం నాటికి విద్యార్థులలో ఎఫ్ఎల్ఎన్ ఫండమెంటల్, లిటరసీ, న్యూమరసీ విధానాలను పెంపొందించే లక్ష్యంతో ప్రతి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఇద్దరు ఉపాధ్యాయులకు ఈ శిక్షణా తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్లు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. బాపట్ల డివిజన్ పరిధిలోని చెరుకుపల్లి, రేపల్లె, నగరం, నిజాంపట్నం, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డుల నవీకరణపై సచివాలయం సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ - బాపట్ల జిల్లా

మిర్చి కల్లాల్లో కారు మేఘాలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మిర్చి రైతులను భయపెడుతున్న కారుమేఘాలు

ఈ ఏడాది ఇంకొల్లు మండలంలో మిర్చి, శనగ పంటలను రైతులు అధికంగా సాగు చేశారు. మిర్చి 80 శాతం కోతలు పూర్తయి కల్లాలో ఆరబెట్టారు. శనగ పంట 90 శాతం కోతలు పూర్తయి పంట ఇంటికి చేరింది. ఈ నెలాఖరుకు పంట మొత్తం పూర్తిగా రైతుల ఇంటికి వచ్చేస్తుంది. అప్పు సప్పు చేసి సాగు చేసిన పంట ఇంటికి వస్తుందన్న ఆనందంలో ఉన్న రైతులకు అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు రావటం, మేఘాలు నల్లగా మారటంతో మిర్చి రైతుల గుండెల్లో దడ మొదలైంది. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేసిన మిర్చి పంట కోతలు కోసి కల్లాల్లో ఆరబెట్టారు. గత రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులను చూసి రైతుల గుండెల్లో బండరాయి పడినట్లయింది. గురువారం కొద్దిపాటి చినుకులు కూడా పడటంతో పరదాలు తీసుకొని కల్లాల్లోకి రైతులు పరుగులు తీస్తున్నారు. కారుమబ్బులు కల్లాల్లో కప్పివేయటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు శనగ రైతులు కోతలు పూర్తి కాలేదు. చేతికి వచ్చే శనగ చివరి అంకంలో ఉంది. ముందు నాడు వేసిన పంట నూర్పిళ్లు పూర్తయి పంట ఇంటికి చేరింది. వర్షాలకు దెబ్బతిన్న పంటను తిరిగి విత్తటంతో ఆ పంట చేతికి రావాల్సి ఉంది. ఇంకొల్లు, కొణికి, గంగవరం, దుద్దుకూరు ప్రాంతాల్లో శనగ కోతలు ఇంకా కోయాల్సి ఉంది. దీంతో శనగ రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. మేఘాలు కమ్మి మిర్చి, శనగ రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

డిఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

21న ఆశా వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: రాష్ట్రవ్యాప్తంగా 21వ తేదీ డిఎంహెచ్‌వో ఆఫీసుల వద్ద జరిగే ధర్నాలో ఆశా వర్కర్స్ పాల్గొనాలని ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపునిచ్చింది. ఈ మేరకు 21వ తేదీ ధర్నా తెలియపరుస్తూ గురువారం బాపట్ల డిఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వి వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ పని భారం తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, ఆశా వర్కర్ల నియామకాలు ప్రభుత్వమే నిర్వహించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు, రాజకీయ జోక్యం ఆపాలని, విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు ఆశవర్కర్ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయ డ్యూటీలు ఆశా వర్కర్లతో చేయించరాదని, ఆశా వర్కర్స్‌కు సెలవులు మంజూరు చేయాలని, కనీస వేతనం 26,000 అమలు చేయాలి, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలి, 104 ఉద్యోగుల కోసం ఆశ వర్కర్లతో ఎలాంటి అదనపు ఖర్చులు చేయించరాదని అన్నారు. ఈ ధర్నాల్లో బాపట్ల జిల్లాలో ఆశాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు బస్వకుమారి, కోటమ్మ, సుజాత, సీఐటీయూ జిల్లా నాయకులు జె శామ్యూల్ పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ, ఇన్‌ఛార్జి డిపిఓ శంకర్ నాయక్

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా

ఆర్థిక వనరులు పెంచుకోవచ్చు: డ్వామా పీడీ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెత్త నుంచి సంపదను తయారు చేయడం ద్వారా గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరులు పెంపొందించుకొని, పర్యావరణానికి కూడా మేలు చేయవచ్చునని ఇన్‌ఛార్జి డిపివో, డ్వామా పీడీ వై శంకర్ నాయక్ అన్నారు. చెత్త నుంచి సంపద తయారు చేసే విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం చెరుకుపల్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నిర్వహించారు. మూడు రోజులపాటు డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు రోజుకు మూడు మండలాల చొప్పున ప్రతి మండలం నుంచి రెండు గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లకు నిర్వహించిన ఒకరోజు అవగాహన కార్యక్రమంలో మొదటిరోజు అమర్తలూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలోని ప్రజాప్రతినిధులు సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి చెత్తను పొడి చెత్తను వేరువేరుగా చేయడం, వాటిని వర్మీ కంపోస్ట్‌గా మార్చే విధానాన్ని తద్వారా గ్రామాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించే విధానాన్ని గురించి అధికారులు అవగాహన కల్పించారు. మొదట అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చెరుకుపల్లి గ్రామ సర్పంచ్ దేవరకొండ వాణి, చెరుకుపల్లి ఎంపీడీవో బి శ్రీనివాసరావు, కొల్లూరు ఎంపీడీవో ఐ సత్యనారాయణ, ఈవోపీఆర్‌డి జి మురళీకృష్ణ, ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

5న కార్మిక కర్షక పోరాట ప్రదర్శన

జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్

కేంద్రంలో మోడీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక-కర్షకుల పోరాట ప్రదర్శన జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ పిలుపునిచ్చారు. సిఐటియు బాపట్ల జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నాయకత్వాన బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజా సమస్యలను మరింత జటిలం చేస్తోందన్నారు. అత్యంత ధనవంతులైన అదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగి తేలుతోందని తెలిపారు. రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తుందని పేర్కొన్నారు. పెద్దఎత్తున పేదలు, కార్మికులు ఉపాధి అవకాశాలు, ఆదాయాలు తగ్గుతూ కార్పొరేట్ వ్యాపారవేత్తల ఆదాయాలు ఘనంగా పెరుగుతున్నాయి. కార్మికులను కట్టు బానిసలుగా చేసే విధంగా కార్మిక చట్టాల్లో మార్పులు, సమ్మెలు చేయకుండా, యూనియన్ ఏర్పాట్లో ఆంక్షలు పెడుతుందని విమర్శించారు. కనీస వేతనాలు, పనిగంటలు, పిఎఫ్, ఈఎస్ఐ తదితర కార్మిక హక్కులపై బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000, కనీస పెన్షన్ రూ.10,000 అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, టైం స్కేల్, డైలీ వేజ్, గౌరవ వేతన కార్మికులను పర్మినెంట్ చేయాలని, అందరికీ సామాజిక భద్రత, సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణ, అందరికీ నాణ్యమైన విద్య, వైద్య విధానం, అధిక ధరలు తగ్గించాలని, ప్రజలు తిండి తినే ఆహార పదార్థాలు, నిత్యావసరాలపై జిఎస్టి ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ వంట గ్యాసులపై ఎక్సైజ్ సుంకం తగ్గించాలని, వ్యవసాయ కార్మికులు, రైతాంగం హక్కులను రక్షించాలని ఏప్రిల్ 5 ఢిల్లీలో జరిగే కార్మిక-కర్షక పోరాట ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, ఎం వసంతరావు పాల్గొన్నారు.

ఎఎన్‌యు వీసీని సస్పెండ్ చేయాలి

నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విశ్వవిద్యాలయంలో ఉన్నత పదవిని నిర్వహించే ఓ వైస్ ఛాన్సలర్ తన సమక్షంలో విపరీత ధోరణులు ఉన్న రామ్‌గోపాల్‌వర్మ లాంటి వ్యక్తి వ్యాఖ్యలు వింటూ ఖండించకపోగా, అతనొక తాత్వికుడని ప్రశంసించటం దుర దృష్టకరమని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్త్రీలను, వారి ఆత్మాభిమానాన్ని అతిహీనంగా కించపరచటంతో పాటు ని, తాగి, తిరుగుతూ.. చదువును నిర్లక్ష్యం చేయమంటూ విద్యార్థులకు సందేశం ఇవ్వడం పట్ల ఆమె అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలని, వైస్ ఛాన్సలర్‌ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని, రామ్ గోపాల్ వర్మపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ స్త్రీ జాతికి నేనొక్కడినే దిక్కవుతా అని, విద్యార్థులు ఉపాధ్యాయుల మాటలు వినకుండా ఇష్టానుసారం జీవించాలని రామ్‌గోపాల్‌వర్మ అనడం,ఈ మాటలను విన్న వైస్ ఛాన్సలర్ ఖండించకపోగా అతన్ని ఫిలాసఫర్ అంటూ పొగడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. పవిత్రమైన ఉపాధ్యాయ వత్తికే అవమానకరమన్నారు. ఈ విషయంపై యూనివర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు అందరూ నిరసన వ్యక్తం చేయాలన్నారు. నరసం ప్రతి జిల్లాలోనూ ఈ విషయం పై సభలు సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి కపావరం, జిల్లా గౌరవాధ్యక్షురాలు ఝాన్సీదుర్గ, బీరం అరుణ, మహిళా నాయకురాలు నాళం నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తేళ్ల అరుణ

రసవత్తరంగా ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో వెలుగొండ శ్రీవెంకటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా రెండు రోజులుగా ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో ఆరుపళ్ళ విభాగం నుంచి 9జతలు ఎడ్లు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన వజ్రాల తేజశ్రీరెడ్డి, ఇస్స్రపాలెం గ్రామానికి చెందిన ఇడై వెంకట రామాంజనేయులు కంబైన్డ్ జత 5,181.9 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా కంభం మండలం యర్రబాలెంకు చెందిన వెంకటగిరి హేమలతానాయుడు, రాచర్ల మండలం గంగపల్లి గ్రామానికి చెందిన వేంపల్లి బాలగంగులు కంబైన్డు ఎడ్ల జత 4, 604.9 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా కాంతినగరానికి చెందిన ఎం.బివానారెడ్డి, కంభం మండలం లింగోజిపల్లి కాలనీకి చెందిన భూపని యల్లయ్య కంబైన్డు ఎడ్ల జత 4599.2 అడుగులు లాగాయి. వైఎస్ఆర్ జిల్లా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన బొగ్గుల రామాంజనేయరెడ్డి, గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్యచౌదరి కంబైన్డు ఎడ్ల జత 4,531 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వెంకటరామిరెడ్డి, ఎల్ఐసి వెంకటరెడ్డి వ్యవ హరించారు. ఈ కార్యక్రమంలో వెలుగొండ ఆలయ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, మేకలవారిపల్లె రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బండలాగుతున్న ఎడ్ల జత

శింగరాయకొండ ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్యలపై

అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ ప్రాథమిక వైద్యశాలలో సిబ్బంది కొరత, వసతుల లేమిపై కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గురువారం అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. గతంలో ఆసుపత్రిలో అన్ని వసతులతో పాటు వైద్య సిబ్బంది అధిక సంఖ్యలో ఉండే వారని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రి పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవడం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదని తెలిపారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఆసుపత్రిలో సిబ్బంది ఉన్నారని, శింగరాయకొండతో పాటు పాకల గ్రామానికి వైద్యశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. పాకల ఆసుపత్రికి స్థలం, నిధులు కేటాయించినప్పటికీ టెండర్ వేసేందుకు ఎవరూ రాలేదని తెలిపారు. శింగరాయకొండ ఆసుపత్రిపై డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అసెంబ్లీలో మాట్లాడంతో ఇకనైనా ఆసుపత్రి అభివృద్ధి చెందుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

'సముద్రం'పై మబ్బుల కనువిందు

ఆసక్తిగా తిలకించిన ప్రజలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరంలో గురువారం ఉదయం వర్షం కురిసింది. ఆ సమయంలో మేఘాలు బాగా కమ్మడంతో సముద్ర తీరంలో మేఘాలు సముద్రంపైకి వచ్చినట్లు కనిపించింది. మేఘాలు నల్లగా సముద్రంపై పొగలు వచ్చినట్లు కనిపించింది. అక్కడికి వచ్చిన సందర్శకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆదృశ్యాలను వీడియోలు తీశారు. సముద్రంపై మబ్బులు వచ్చి పొగలా కమ్ముకోవడాన్ని ప్రజలు ఆసక్తిగా చూశారు. పాకల పల్లెపాలెం వద్ద చోటు చేసుకున్న ఈ ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

సముద్రంపై వచ్చిన మబ్బుల దృశ్యాన్ని తిలకిస్తున్న చిన్నారులు

వైభవంగా వెలుగొండ తిరునాళ్ల

ప్రజాశక్తి-కొనకనమిట్ల

వెలుగొండ శ్రీవెంకటేశ్వరస్వామి తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు విచ్చేశారు. ఆలయ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఇఒ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యములు కలుగకుండా తగు చర్యలు చేపట్టారు. మహిళలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్న సమయంలో ఉత్సవ మూర్తులను వీధుల్లో ఊరేగించారు. అర్చకులు నంద్యాల ప్రసాదచార్యులు, యుగంధరశర్మ, పవన్‌శర్మ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సామాజిక వర్గాల సత్రాలలో అన్నదానం నిర్వహించారు. గార్లదిన్నె టిడిపి నాయకులు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా మంచినీటిని సరఫరా చేశారు. దర్శి డిఎస్‌పి నారాయణస్వామి ఆధ్వర్యంలో పొదిలి సిఐ సుధాకర్‌రావు పర్యవేక్షణలో పలువురు ఎస్ఐలు, ఎఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మార్కాపురం, పొదిలి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విద్యుత్ ప్రభ

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి

ప్రజాశక్తి- దర్శి

రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ దర్శి ప్రాంత రైతులతో కలిసి విజయవాడలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి మాట్లాడుతూ పెండింగ్‌లోనున్న పంట నష్టపరిహారం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ మేరకు మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి-దర్శి

ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో మేలు అని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఉష, వెంకటేశ్వరరెడ్డి, శివకుమార్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్

పౌష్టికాహార కిట్లు అందజేత

ప్రజాశక్తి- మద్దిపాడు

టిబి భారత్ అభియాన్ కార్యక్రమంలో టిబి రోగులకు పౌష్టికాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధిని ప్రారంభదశలో గుర్తిస్తే సులభంగా నయం చేయవచ్చునని తెలిపారు. లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మద్దిపాడు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ డి. మానస మాట్లాడుతూ 2025 నాటికీ క్షయ వ్యాధి రహిత దేశంగా చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. టిబి లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆరునెలల పాటు మందులు అందజేస్తే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. జిల్లా టిబి వైద్యశాలకు మందులు ఉచితం అందజేస్తారని తెలిపారు. అనంతరం యోగాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భవ్య ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసరావు, సిహెచ్‌ఒ లలితమ్మ, పిహెచ్‌ఎన్ రజిత కుమారి, చంద్రమౌళి, ఎంపిహెచ్‌ఇఒ వెంకటరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్లు నాగేశ్వరావు, బాలకోటయ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కనిగిరి

మండల పరిధిలోని కంచర్లవారిపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉమెన్స్‌డే సందర్భంగా నిర్వహించిన కేల్ ఇండియా దస్కంధం అనే పోటీలలో పాతపాడు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటినట్లు ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసాచారి తెలిపారు. ఖోఖో పోటీలలో తమ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు, వారిని తీర్చిదిద్దిని వ్యాయామ ఉపాధ్యాయురాలు పి. సావిత్రిని ఈ సందర్భంగా శ్రీనివాసాచారి అభినందించారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

126 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రానికి జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీఠాపురం గ్రామానికి చెందిన రైతులు 1,336 పొగాకు బేళ్లను బుధవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 910 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 126 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.190, సరాసరి ధర రూ. 198.22 పైసలు పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు.

టంగుటూరులో 84 బేళ్లు తిరస్కరణ

టంగుటూరు : స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు వేలం కేంద్రానికి మండలంలోని పొందూరు గ్రామానికి చెందిన రైతులు 740 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 657 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 84 బేళ్లను తిరస్కరించారు. పొగాకు కిలో అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.185 పలికినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, పొందూరు గ్రామ రైతులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఐ

పరీక్షా కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇంటర్ పరీక్ష కేంద్రాల పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. సీనియర్ ఇంటర్ పరీక్షల సందర్భంగా బుధవారం పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లోకి ఇతరులు ప్రవేశించకుండా, కాపీలు రాయకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి నిర్ణీత సమయానికి ముందుగా చేరుకోవాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ సామగ్రి తీసుకొని రావొద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలన్నారు. **పొన్నలూరు :** పొన్నలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఎస్ఐ డి.రాజారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

ప్రజాశక్తి-కనిగిరి

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని బొడ్డుచావిడి వద్దనున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు అని ఆయన త్యాగాలు మరువలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. **మార్కాపురం :** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని తెలుగు ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి కొనియాడారు. పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా తన నివాస గృహంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ఆశయాల కోసం పనిచేయాలని యువతకు సూచించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలుఖం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి అని ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖరరెడ్డి కొనియాడారు. తొలుత పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాటాడుతూ భావి తరాలకు పొట్టి శ్రీరాములు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, సమీఉల్లా, రమేష్, దండా వెంకటరెడ్డి, ఆంజనేయులు, భారతి, శ్రీరంగనాథ్, శ్రీరంగాచారి, వినోద్‌కుమార్,

దొనకొండలో నివాళులర్పిస్తున్న నాయకులు

వేణుగోపాల్, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, కొండయ్య, నారాయణరెడ్డి, ముసలయ్య, శివాంజనేయులు పాల్గొన్నారు. **దొనకొండ** : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వి.వసంతరావు నాయక్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఉషామురళి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి ఎనలేనిదన్నారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.సాంబశివరావు, ఈఒఆర్‌డి ఎస్.డేవిడ్, కార్యదర్శులు పి.క్రిష్ణమూర్తి, మన్నె శ్రీనివాస్, రామాంజనేయులు, రాచగొర్ల బోడయ్య పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** మండల పరిధిలోని ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 144 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 134 మంది హాజరయ్యారు. 10మంది గైర్హాజరయ్యారు. సిసి కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రంగనాయకులు తెలిపారు. **నాగులుప్పలపాడు :** ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించి అశువులు బాసిన పొట్టి శ్రీరాములు జయంతిని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా

మార్కాపురంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జంకె

ఉప్పుగుండూరు పార్కు సెంటర్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొంజేటి వెంకట సురేష్ బాబు, జోనల్ చైర్మన్ రాజా ,వాసవీ క్లబ్ ఉప్పుగుండూరు గ్రామ అధ్యక్షుడు దేసు సుధాకర్ , అమరా వేణు, విశ్రాంత ఉపాధ్యాయుడు రాఘవేంద్రరావు, సామాజిక సేవ కార్యకర్త, రోజ్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపల్ శామ్యూల్ . గ్రామస్తులు పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వాసవీ క్లబ్ , మహిళా క్లబ్, ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద మరియు బస్టాండ్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు జి.బదరీ నారాయణ, మహిళ క్లబ్ అధ్యక్షరాలు జి.పద్మజ, ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ కార్యదర్శి పి.ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎస్. సత్యనారాయణ, వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధుల ప్రసాదరావు, జివిఎల్. ప్రసాదరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎన్‌వి.సుబ్బారావు, ఎం. మారుతీరావు ,కె.కోటేశ్వరరావు ,ఎం. బసుబ్బయ్య పాల్గొన్నారు

జడ్‌పి హైస్కూల్లో ...

స్థానిక జడ్‌పి హైస్కూల్లో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.రామారావు, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి పి. ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మద్దిపాడు :**

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆంధ్రుల ఆరాధ్య దైవం పొట్టి శ్రీరాములు అని తూర్పు ప్రాథమిక ప్రధానోపాధ్యాయుడు నల్లూరి వెంకట నరసింహారావు తెలిపారు. మద్దిపాడు శాఖా గ్రంథాయలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు వసుంధరాదేవి, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, విశ్రాంత

కొండపిలో శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి

గ్రంథ పాలకుడు జి. నరసింహారావు, కాకుమాను సుబ్బారావు, కనపర్తి సుబ్బారావు, హరిబాబు, బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **కొండపి :** స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు కోటేశ్వం రావు శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు సిహెచ్.ఆంజనేయులు, డి.విరాట్‌బాబు తదితరులు పాల్గొన్నారు. **దర్శి :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తమ ప్రాణాలను పెట్టి అమరజీవి పొట్టి శ్రీరాములు అందరికీ ఆదర్శమని తాళ్లూరు ఎంపిపి తానికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి తెలిపారు. తాళ్ళూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ

దోర్నాలలో నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు

కార్యక్రమంలో ఎంఇఒ సుబ్బయ్య, ఇఒఆర్‌డి ప్రసన్న,. వైస్ ఎంపిపి వెంకటేశ్వరరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, సర్పంచులు చార్లెస్ తర్జన్, వలి తదితరులు పాల్గొన్నారు. **పెద్దదోర్నాల:** దోర్నాలలోని శాఖా గ్రంధాలయంలో గ్రంథాపాలకుడు వై వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చీరాల :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు మహనీయులు అని కేరళ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సాల్మన్ తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక పేరాల ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూల్‌లో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ ,గాంధీ,కుమార్ వెలుగొండా రెడ్డి, కష్ణమోహన్, యల్లమందేశ్వరరావు, ప్రసన్నకుమారి, పవని భానుచంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు

కనగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు



దర్శిలో నివాళులర్పిస్తున్న నాయకులు

మాదకద్రవ్యాలను అరికట్టడమే లక్ష్యం

బాపట్ల డిఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉంటేనే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్షణికమైన అనుభూతుల కోసం మత్తు పదార్థాలను ఆశ్రయిస్తే జీవితమే చీకటిమయం అవుతుందని బాపట్ల డీఎస్పీ ఎ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రం మార్టూరులో దుర్గా మల్లేశ్వర కల్యాణ మండపంలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సంకల్పం కార్యక్రమంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీఎస్పీ మాట్లాడారు. మాదక ద్రవ్యాలను అరికట్టడమే సంకల్పంగా బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎస్పీలు సంయుక్తంగా డ్రగ్స్‌కి వ్యతిరేకంగా సంకల్పం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో వేళ్లూనుకుపోతున్న మాదక ద్రవ్యాలను అరికట్టడానికి విద్యాసంస్థల యజమానులు డ్రగ్స్ నిర్మూలన కమిటీని ఏర్పాటు చేసి తమ పరిధిలోని విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి బాపట్ల జిల్లాను గంజాయి, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దటానికి కృషి చేయాలని డిఎస్పీ కోరారు. అనంతరం మార్టూరు సీఐ షేక్ థెరిసా ఫిరోజ్ డ్రగ్స్ వినియోగం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలు, డ్రగ్స్ తీసుకుంటే తీసుకునే చట్టపరమైన చర్యలు, మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి ఎలా బయట పడాలి వంటి అంశాల గురించి విద్యార్థులకు డిజిటల్ బోర్డు ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు, మార్టూరు ఎస్ఐలు చెంచు ప్రసాద్ కోడూరు కమలాకర్, మార్టూరు శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, విఎస్ఆర్ఎఎమ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి, పర్చూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

కొండమూరులో జరిగిన గ్రామసభలో పాల్గొన్న రైతులు

ఈ క్రాప్ లిస్టులో తప్పులుంటే..

ఆర్‌బికెలో ఫిర్యాదు చేయాలి

ప్రజాశక్తి-పంగులూరు

రబీ ఈ క్రాప్ (2022-23కు సంబంధించి)లో ఏమైనా సమస్యలు ఉంటే, వెంటనే ఆర్‌బికెలలో ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి కోరారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని కొండమూరు గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో రబీ 2022-23కు సంబంధించి ఈక్రాప్ సోషల్ ఆడిట్ లిస్టు ఈ నెల 13వ తేదీ నుంచి గ్రామ సచివాలయాల్లో, రైతు భరోసా కేంద్రాల్లో ఉంచామని తెలిపారు. గ్రామసభలో ఈ క్రాప్ లిస్టులో ఉన్న పేర్లు, ఈ క్రాప్ వివరాలు గ్రామ సభలో చదివి వినిపించారు. లిస్టులో ఏమైనా సమస్యలు ఉంటే రైతులు రైతు భరోసా కేంద్రంలో ఫిర్యాదు చేస్తే, వెంటనే సరిచేస్తామని చెప్పారు. ఈ అవకాశం ఈ నెల 25వ తేదీ వరకు ఉందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అంజిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు జాగర్లమూడి దినేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

బడ్జెట్లో చేనేతకు తీరని అన్యాయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసేవిధంగా ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగానికి అవసరమైన నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిందని చేనేత నాయకులు ఎం సత్యనారాయణ, జి బాలాజీ వేరు వేరు ప్రకటనల్లో ఖండించారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన లక్ష 79 వేల 279 కోట్లలో చేనేత రంగానికి కేవలం 200ల కోట్లు మాత్రమే కటాయించటం దారుణమన్నారు. ఈ కేటాయింపులు కూడా నేతన్న నేస్తం పథకానికే సరిపోతాయని చేనేత పరిశ్రమను కాపాడేందుకు ఒక్క పైసా కూడా లేదన్నారు. కనీసం 2 వేల కోట్లు కేటాయిస్తేనే పరిశ్రమ మనుగడ కొనసాగుతుందని వారు డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను గురువారం డిఆర్డీఏ పిడి, వేమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి అర్జున రావు పరిశీలించారు. ఉగాది నాటికి గృహ నిర్మాణాలు వేగవంతం చేసి పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం డ్వాక్రా ద్వారా రూ.35 వేలు అందిస్తుందని వాటితో బేస్మెంట్ పూర్తి చేసుకోవచ్చునన్నారు. ముఖ్యంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాల్లో పురోగతి ని సాధించడంలో అధికారులు విఫలం చెందితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, పశు సంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, ఎంపిడివో చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య రేవతి, ఏపిఎం శోభన్ తదితరులు ఉన్నారు.

గృహాలను పరిశీలిస్తున్న అధికారులు

1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

1998 డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేస్తూ ప్రభుత్వం బుధవారం జీవో నెంబర్ 27 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4,534 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులు కాంట్రాక్టు పద్ధతిలో నియామకం పొందుతారు. వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపు ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 1998 డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు సంబంధించి గత ఏడాది ఆగస్టు నెలలో ఒంగోలులోని డిఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో అర్హతా పత్రాల పరిశీలన జరిపారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 730 మంది మంది హాజరయ్యారు. నూతనంగా విడుదల చేసిన జీవోలో 60 ఏళ్ల పైబడిన వారిని అనర్హులుగా ప్రకటించాలని తెలిపారు. ఈ కారణంగా అర్హులైన వారిలో 100 మందికి పైగా తప్పుకోవలసి ఉంటుందని తెలుస్తోంది. అప్పటి డిఎస్సీలో వచ్చిన క్వాలిఫైయింగ్ మార్కులతో పాటు ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులు పరిగణలోకి తీసుకుని ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నూతన మార్గదర్శకాల మేరకు కౌన్సెలింగ్ జరిపి మినిమం టైమ్‌స్కేల్ పద్ధతిలో నెలకు రూ.34 వేల వేతనంతో నియామకాలు జరుపనున్నారు. రోస్టర్ కమ్ మెరిట్ ప్రాతిపదికన రిజర్వేషన్లను కూడా పరిగణలోకి తీసుకుని జిల్లాకు కేటాయించిన పోస్టుల సంఖ్య ఆధారంగా నియామకాలు ఉంటాయని చెబుతున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా జరిపిన అర్హతా పత్రాల పరిశీలనలో 6,852 మంది అప్పట్లో అర్హులుగా తేలారు. ప్రస్తుతం జారీ చేసిన జీవో ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 4,534 పోస్టులు మాత్రమే భర్తీ చేయనున్నట్లు జీవోలో తెలిపారు. దీని ప్రకారం ఉమ్మడి ప్రకాశంలో అర్హులుగా తేలిన 730 మందిలో ఎంతమందికి పోస్టులు దక్కుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయిని (ఫైల్)

నీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న డిఇ సతీష్

చెరువును నింపుతాం: ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రానున్న వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇంకొల్లు నాగుల చెరువును పూర్తి స్థాయిలో నింపుతామని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సతీష్ వివరించారు. ప్రతి ఏటా పర్చూరు రోడ్డులోని మార్కెట్‌యార్డు ప్రక్కన ఉన్న నాగార్జున సాగర్ కాలువ నుంచి 12 ట్రాక్టర్ల ద్వారా నీటిని పంపింగ్ చేసేవారు. పర్చూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ఆదేశాల మేరకు 4 హైస్పీడ్ విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని మళ్లిస్తున్నామన్నారు. మరో 2 మోటార్లు తీసుకువచ్చి వేగవంతంగా నీరు తరలించే ప్రక్రియ చేపడతామని సతీష్ వివరించారు. ప్రాధాన్యత క్రమంలో మిగిలిన గ్రామాల్లో చెరువులను కూడా పూర్తి స్థాయిలో నింపి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని సతీష్ హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ పి జ్యోతి, ఉప సర్పంచ్ సయ్యద్ లతీఫ్, వార్డు సభ్యులు షేక్ మాలిక్ తదితరులు ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

వేసవి కాలంలో వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని బాపట్ల తహశీల్దార్ కవిత సూచించారు. గురువారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడా రు. చిన్నారుల తల్లులు అత్యవసర పనులపై బయటకు వచ్చే సమయంలో వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు చేసే సమయంలో మంచినీటిని అందుబాటులో ఉంచుకొని ప్రయాణాలు చేయాలని చెప్పారు. ఇప్పటికే ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటున్నాయని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. త్వరలో మండల, పట్టణ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయించి వాహనదారులకు, పాదచారులకు మంచినీటిని అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్లో చేనేతకు మొండిచేయి

చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి-బాపట్ల

ఎం సత్యనారాయణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత రంగానికి మొండి చేయి చూపారని చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ నాయకులు ఎం సత్య నారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023-24 యేడాదికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి ఏమాత్రం కేటాయింపులు జరగలేదన్నారు. కేవలం నేతన్న నేస్తానికి రూ.2 వందల కోట్లు కేటాయించారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు రిబేటు బకాయిలు, యార్న్ (నూలు) సబ్సిడీ, ఆప్కో బకాయిలు, కంట్రిబ్యూషన్ వంటి స్కీములకు లక్షలాది రూపాయలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ప్రభుత్వం తక్షణమే చేనేత రంగానికి ఈ బడ్జెట్లో రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా చేనేత రంగానికి రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి, ప్రతినిత్యం పెరిగిపోతున్న నూలు ధరలను స్థిరీకరించాలని ఆయన కోరారు.

ఇంటర్ పరీక్షలకు 12 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు గురువారం ఇంకొల్లు సెంటర్‌లో 12 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 342 మంది విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షలు రాయాల్సి ఉండగా 330 మంది పరీక్షకు హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ యు రవికుమార్ తెలిపారు. శుక్రవారం ప్రథమ సంవత్సరం ఇంగ్లీషు పరీక్ష జరగనుందన్నారు. 430 మంది పరీక్ష రాయనున్నారని రవికుమార్ వివరించారు.

గొల్లపాలెంలో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలం గొల్లపాలెంలో 492వ నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన వల్లభనేని వీరరాఘవయ్య(85) మృతి చెందగా నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. గుంటూరు శంకర కంటి వైద్యులు గొల్లపాలెం వచ్చి కార్నియాలు సేకరించారు. నేత్రదానం చేసినందుకు క్లబ్ ప్రతినిధులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహన్‌రావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావులు.. వీరరాఘవయ్య కుటుంబ సభ్యులు కేశవరావు, నాగేంద్రం, భవాని శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మాల్యాద్రి చౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

అందరి మన్ననలు పొందిన వ్యక్తి 'బిఎంసి'

కనిగిరి మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-పామూరు

బొల్లా మాల్యాద్రి చౌదరి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి, అభిమానులకు నిరంతరం అండగా ఉంటానని కనిగిరి మాజీ శాసనసభ్యులు, టిడిపి ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం బొల్లా మాల్యాద్రిచౌదరి సంతాప సభ కందుకూరు రోడ్‌లో మహాలక్ష్మీ మిల్క్ డైరీ ప్రాంగణంలో అడుసుమల్లి ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి కుటుంబసభ్యులు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అనంతరం ఉగ్ర మాట్లాడుతూ నీతి, నిజాయతీగా ఉంటూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునే వ్యక్తి బిఎంసి అని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ స్వయంకృషితో రాజకీయాల్లోకి వచ్చి తనదైన శైలిలో పేరు తెచ్చుకున్నారన్నారు. వారి కుటుంబానికి సిపిఎం అండగా ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, చీరాల, ఎర్రగొండపాలెం, గిద్దలూరుల టిడిపి ఇన్‌ఛార్జిలు ఎంఎం కొండయ్య, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబు, రామారావు, లక్ష్మన్‌నాయుడు మాట్లాడుతూ బిఎంసి అకాల మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆశయాల కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె రహంతుల్లా, భువనగిరి వెంకటయ్య, డోలా శేషు, కరీముల్లా, రామసుబ్బారెడ్డి, ఏలూరి వెంకటేశ్వర్లు, సిపిఐ మౌలాలి పాల్గొన్నారు.

విద్యార్థులను తనిఖీ చేశాకే అనుమతించండి

ఏకెవికె కళాశాలలో కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న ఒంగోలులోని ఏకెవికె కాలేజీని తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, వారికి పరీక్షా కేంద్రంలో కల్పించిన సదుపాయాలపై ఈ సందర్భంగా ఆయన ఆరా తీశారు. సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఏవిధమైన ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఇతర సిబ్బంది సెల్‌ఫోన్‌తో విధులలో పాల్గొనరాదని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణ విధులలో ఉల్లంఘన జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులు మినహా ఇతరులెవరినీ పరీక్షా కేంద్రంలోకి ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించరాదని స్పష్టం. చేశారు. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలను చీఫ్ సూపరింటెండెంట్ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నా పరీక్షల రెండో రోజైన గురువారం తెలుగు-2, సంస్కృతం పేపర్లను నిర్వహించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 26,397మంది విద్యార్థులను కేటాయించగా 25,253 మంది హాజరు కాగా 1141 మంది గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ విద్యార్థులు 23,284 విద్యార్థులను కేటాయించగా 22,434 మంది హాజరు కాగా 897 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 3113 మందిని కేటాయించగా 2819 మంది హాజరు కాగా 294 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఏ.సైమన్ విక్టర్ ఆరు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. హైపవర్ కమిటీ, డిఇసి, డివిఇఒ సభ్యులు 14 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ జిల్లాలోని 40 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

అమరజీవిని ఆదర్శంగా తీసుకోవాలి

నివాళులర్పించిన కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట పటిమను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక సివిఎన్ రీడింగ్ రూమ్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరా టంలోనూ, అనంతరం భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడడంలోనూ పొట్టి శ్రీరాములు పాత్ర చిరస్మరణీయమని కొనియా డారు. అలాంటి మహనీయుల జీవితాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు, తహశీల్దార్ పి. మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలు జరిగాయి.

'ఆధార్' నవీకరణ ప్రక్రియ వేగవంతం: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియ వేగంగా చేపట్టాలని సచివాలయాల సిబ్బందిని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియపై గురువారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లా జనాభాలో 97 శాతం ఆధార్ కార్డులు ప్రజలకు ఉన్నాయన్నారు. మిగిలిన వారందరికీ కార్డులు ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో 57 సచివాలయాలలో ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని, ఆ కేంద్రాలలో నవీకరణ ప్రక్రియ కొనసాగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో 75,680 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వారందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డులు ఇవ్వాలన్నారు. 25,790 మంది చిన్నారులను ఆధార్‌లోకి తీసుకొచ్చారన్నారు. వారందరి పేర్లు, వేలిముద్రలు తీసుకోవాలన్నారు. మిగిలిపోయిన 49,890 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు లేవన్నారు. జిల్లాలో 1,888 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 30 కేంద్రాలలో 1,710 మంది చిన్నారుల వివరాలను ఆధార్ కార్డుల వెబ్ సైట్లోకి నిక్షిప్తం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారతదేశంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఆధార్ కార్డుల పొందిన వారంతా 10 సంవత్సరాల తరువాత తప్పనిసరిగా నవీకరణ చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలన్నింటినీ సంబంధిత సచివాలయాలకు మ్యాపింగ్ చేశామన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు 30 రోజుల్లో అంగన్ వాడి కేంద్రాలలోని చిన్నారులందరికీ ఆధార్ కార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఆధార్ నమోదు, ఆధార్ నవీకరణ ప్రక్రియ కలెక్టరేట్‌కు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో సి.పి.ఒ జి.భరత్‌కుమార్, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్‌బాబు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి..

- సంక్షేమ పథకాలకు పెద్ద పీట: వైసిపి
- అంకెల గారడీ తప్ప మరొకటి కాదు
- వామపక్షాలు, జనసేన, టిడిపి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి 2023-24 సంవత్సరానికి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్షాలన్నీ పెదవి విరుస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మరోసారి మొండి చెయ్యి ఎదురైంది. రూ.2,79,279 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేసిందని అధికార వైసిపి నేతలు చెబుతున్నారు. రానున్న ఎన్నికలలో దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరొకటి కాదని వామపక్షాలు, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు విమర్శిస్తున్నాయి. ప్రాధాన్యతా రంగాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని వారు కోరుతున్నారు.

బడ్జెట్‌లో పేదల అభివృద్ధికి పెద్దపీట

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

2023-24 సంవత్సరానికి రూ. 2,79,279 కోట్లతో రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. సంక్షేమ పథకాలకు సంభందించి కేటాయింపుతో పాటు పేదల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. అన్ని రంగాలకు సముచిత స్థానం కల్పించి పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కతజ్ఞతలు తెలియజేస్తున్నా. పేద ప్రజా సంక్షేమంతోపాటు అన్ని రంగాలకు సముచిత ప్రాముఖ్యత నిచ్చి అన్ని వర్గాల ప్రజల అభివద్ధికి ఉపయోగపడే విధంగా బడ్జెట్ రూపొందించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి అభినందనలు.

వెలిగొండను పూర్తిచేసేందుకు నిధులేవీ?

టిడిపి నేత, మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్

బడ్జెట్లో కనీసం వెలుగొండ లాంటి ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించలేదు. ప్రకాశం జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ ట్రిబుల్ ఐటీల నిర్మాణానికి నిధులను కేటాయించకపోవడం దారుణం. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ పథకం అమలుకు, గత సంవత్సరం బకాయిలు చెల్లించడానికి, ప్రస్తుత విద్యా సంవత్సరం ఫీజులు చెల్లించడానికి సరిపడా నిధులు కేటాయించలేదు. అమ్మ ఒడికి రూ.6500 కోట్లు కేటాయింపులు చూస్తే అర్హులైన వారందరికీ ఈ పథకం అమలయేట్లు కనిపించడం లేదు. ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్ నిధులను తిరిగి చెల్లించడం కోసం బడ్జెట్లో ఎలాంటి స్పష్టత లేదు.

ఎన్నికల కోసమే పెట్టిన బడ్జెట్

సయ్యద్ హనీఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శి

2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. సంక్షేమ పథకాలకు అధిక నిధులు కేటాయించి వ్యవసాయం, అనుబంధ రంగాలకు మొక్కుబడి నిధులు కేటాయించారు. ఇరిగేషన్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో జిల్లాలోని వెలుగొండ, గుండ్లకమ్మ, సంగమేశ్వర ప్రాజెక్టుల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారుతోంది. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన వాటి అభివృద్ధికి సరైన ప్రణాళికలు చూపించలేదు. వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయించలేదు. ఆరు రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ విషయమై ఎలాంటి ప్రస్తావన చేయలేదు. రాష్ట్రంలో 2.14 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే వాటి భర్తీకి ఎలాంటి ప్రస్తావన చేయలేదు. బడ్జెట్ అంచనాలు సవరించి ప్రాధాన్యత రంగాలకు అధిక నిధులు కేటాయించటంతో పాటు వెనుకబడి జిల్లాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. ప్రకాశం జిల్లా యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటి, దొనకొండ పారిశ్రామిక కారిడార్, నిమ్జ్‌కు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

ఆర్థిక డొల్లతనం చూపిన బడ్జెట్

షేక్ రియాజ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వ ఆర్థిక డొల్లతనం చూపించిన బడ్జెట్ ఇది. బడ్జెట్లో కేటాయింపుల ఘనమే తప్ప ఆచరణలో మంజూరు అరకొరే అని వైసీపీ పాలనతో వెల్లడవుతోంది. ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల హంగామా తప్ప మరేమీ లేదు. గడపగడపకూ ప్రభుత్వం స్కీమ్ పెట్టి రూ.532 కోట్లు ప్రతిపాదించడం విడ్డూరం. ప్రజలు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించడానికి రూ.లక్ష కోట్లు పైగా కేటాయించాలి. భారీ లెక్కలు, అంచనాలు చూపించి ఆ తరవాత సవరించిన అంచనాల పేరుతో కేటాయింపుల్లో కోతలు వేస్తోంది ప్రజలను మభ్యపెట్టేందుకే ఇలాంటి అంకెల గారడీ చేస్తున్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

డివిఎన్ స్వామి, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో 62 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితుల్లో రైతు కుటుంబాలకు పరిహారం కోసం రూ.20 కోట్లు, రైతులకు వడ్డీ లేని రుణాల కోసం రూ.500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం గడపగడపకీ మన ప్రభుత్వం పేరుతో తమ రాజకీయ ప్రచారానికి మాత్రం రూ.532 కోట్లు కేటాయించడం సిగ్గుచేటు. రూ.54228 కోట్లు జనానికి పంచుతున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం అంతకు మించి రూ.54,587 కోట్లు అప్పుల భారాన్ని ప్రజల నెత్తిన పెడుతోంది.

నీటిపారుదలకు అరకొర కేటాయింపులు

సిఎస్ సాగర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి



రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ, నీటిపారుదల రంగాలకు అరకొర కేటాయింపులు జరిగాయి. గత సంవత్సరంతో పోలిస్తే అదనంగా సుమారు 23 వేల కోట్ల కేటాయించిన, వ్యవసాయ రంగానికి 11,589 కోట్లు, నీటిపారుదల రంగానికి 11,908 కోట్లు అరకొర నిధులే కేటాయించారు. వెలుగొండ వంటి ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించలేదు. అమ్మ ఒడికి రూ.6500 కోట్లు కేటాయింపులు చూస్తే అర్హులైన వారందరికీ ఈ పథకం అమలయ్యేలా కనిపించడం లేదు. ప్రజల ఉపాధి అవకాశాలు పెంచే శాశ్వత ప్రాతిపదికన సుస్థిర ఆర్థిక అభివద్ధికి తోడ్పడే ఆర్థిక వ్యూహం లేని బడ్జెట్‌గా ఈ బడ్జెట్ కూడా చేరిపోయింది.

మరోసారి ప్రజలను మోసగించిన ప్రభుత్వం

సిపిఐ జిల్లా కార్యదర్శి యం.యల్.నారాయణ

ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తిచేసి ఎన్నికలకు వస్తామని ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి గారు స్వయంగా ప్రకటించినందున ఈసారి బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయిస్తారని జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఈరోజు ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లాయి. మరోసారి జిల్లా ప్రజలను జగన్ ప్రభుత్వం మోసగించింది. జిల్లా అభివద్ధి ఊసే ఈ బడ్జెట్లో లేకపోవడం అన్యాయం.